

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5.39,643లు, బంగారం 1 గ్రాము 300 మిల్లీగ్రాములు వెండి 266 గ్రాముల 407 గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



'ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి'

కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని ట్రేడ్ యూనియన్ల నాయకులు డిమాండ్ చేశారు.

- 8లో



నవరంగపూర్ బంద్‌కు బీజేడీ పిలుపు

ఈనెల 26న నవరంగపూర్ జిల్లా బంద్‌కు విపక్ష బిజూ జనతా దళ్ పిలుపునిచ్చింది.

- 8లో

న్యూస్‌రీల్

రాత్రికి రాత్రే రోడ్డు మరమ్మతులు



ఎస్‌కేసీజీ కాలేజ్ రోడ్డులో సగం వేసిన తారు రోడ్డు

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డు మరమ్మతులకు గురవ్వడంతో ఇటీవల గజపతి జర్నలిస్టుల సంఘం సభ్యులు ఇసుక, కంకరతో గుంతలు కప్పారు. ఈ సంఘటనతో జిల్లా అధికారులు వెంటనే రోడ్డు మరమ్మతులకు టెండర్లు పిలిచారు. ఇటీవల రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెన్నా పర్లాకిమిడిలో జరిగిన వికాస్ మేళాకు అతిథిగా విచ్చేశారు. దీంతో ఆయన వద్ద రోడ్డు విషయం పలువురు ప్రస్తావించడంతో వెంటనే రాత్రికి రాత్రి రోడ్లు-భవనాల శాఖ అధికారులు రోడ్డు పనులను మొదలుపెట్టారు. దీనిని రూ.40 కోట్లతో గుత్తేదారు కాంట్రాక్టు దక్కించుకున్నట్లు సమాచారం. అయితే తారు రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. దీనిపై పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెవి దిద్దుల చోరీ



బాధితురాలు సుభాషిణి దాస్

రాయగడ: పొలం పనులు ముగించుకొని ఇంటికి తిరిగి వస్తున్న ఒక వృద్ధ మహిళపై గుర్తు తెలియని దుండగులు దాడిచేసి, ఆమె పెట్టుకున్న బంగారు చెవి దిద్దులను తెంపుకొని వెళ్లిన ఘటన జిల్లాలోని గుణుపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి లిమామోడ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఈ మేరకు బాధితురాలు సుభాషిణి దాస్ గుణుపూర్ ఆదర్శ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తీవ్రంగా గాయాలకు గురైన ఆమెను సమీపంలోని కొందరు పరుగున వెళ్లి గుణుపూర్ ఆస్పత్రిలో చికిత్స కోసం తరలించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలిస్తున్నారు.

గాజులబంద గోడు పట్టదా..?



గాజులబంద గ్రామానికి వెళ్లే రహదారి


మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి నక్కమమ్ముడి పంచాయతీ గాజులబంద గ్రామంలో నివసిస్తున్న గిరిజనులు రెండు నెలలుగా అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. గత రెండు నెలలుగా ఇక్కడ కురుస్తున్న వర్షాలతో కొండ చరియలు పడి రహదారి మట్టితో కొట్టుకుపోయింది. ఈ గ్రామంలో 8 ఇళ్లు ఉన్నాయి. అయితే రహదారి కొట్టుకుపోవడంతో వీరికి రెండు నెలలుగా రేషన్ సరుకులు అందడం లేదు. గ్రామంలోకి వాహనాలు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో వారి వద్దనున్న బియ్యంతో స్థానికంగా గోతులు తీసుకొని వచ్చిన నీటితో అన్నం వండుకొని జీవిస్తున్నారు. ఈ రెండు నెలల కాలంలో ఇంతవరకు ఒక్క అధికారి కూడా తమ గ్రామాన్ని సందర్శించలేదని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

హరిహర మిశ్రా కన్నుమూత



హరిహర మిశ్రా

భువనేశ్వర్: ఒడిశా సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ కవి హరిహర మిశ్రా (84) సోమవారం మృతి చెందారు. ఆయన మృతిపై సీఎం మోహన్ చరణ్ మాఝి, గవర్నర్ రఘుబర దాస్, విపక్ష నేత నవీన్ పట్నాయక్ తదితరులు సంతాపం ప్రకటించారు. పూరీ కళాశాలలో అధ్యాపకునిగా పని చేసిన ఆయన, కవి, గాల్పికుడు, అనువాదకుడు, నాట్యకారునిగా పేరొందారు. అధ్యాపకునిగా పనిచేస్తూ ఆకాశవాణి నాటకాల్లో నటించారు. 2016 సంవత్సరంలో ఆయన ఒడిశా సాహిత్య అకాడమీ 31వ అధ్యక్షుడుగా నియమితులయ్యారు. సాహిత్యం, నాటకం, రంగస్థల నటుడుగా పలు ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నారు.



ఓవర్ టు భరత్‌పూర్..!

భరత్‌పూర్ పోలీసుస్టేషన్.. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఒక్కరి నోట్లో నానుతున్న పేరు. ఈ స్టేషన్‌లో ఏం జరిగిందనేది తెలుసుకోవడానికి ప్రజలంతా ఎంతో ఆవేదనతో ఎదురు చూస్తున్నారు. రక్షకులైన పోలీసులు రాక్షసుల్లా వ్యవహరించారని బాధితులు ఆరోపించడంతో రాష్ట్రమంతా భగ్గుమంటోంది. కేసులో నిజాలను పక్కాగా వెలికి తీయాలని ముక్తకంఠంతో ప్రజలు, ప్రతిపక్షాలు కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక కమిషన్‌తో విచారణకు ఆదేశించింది.

\- భువనేశ్వర్

- రాష్ట్రంలోని అందరిచూపు అటువైపే
- స్టేషనలో ఏం జరిగిందని చర్చలు
- విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

హైకోర్టులో కేసు విచారణ

భరత్‌పూర్ ఠాణా కేసు అనుక్షణం కొత్త మలుపులు తిరుగుతోంది. బహుముఖంగా చర్చనీయాంశమైన ఈ ఘటనపై రాష్ట్ర హైకోర్టు విచారణ చేపట్టింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్, జస్టిస్ సావిత్రి రథొలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. అనంతరం తదుపరి విచారణ అక్టోబర్ 8వ తేదీకి వాయిదా వేసింది. విచారణ పురస్కరించుకుని ధర్మాసనం తీవ్ర కలవరం వ్యక్తం చేసింది. లెఫ్టినెంట్ జనరల్ పి.ఎస్.షెకావత్ అభ్యర్థన లేఖ ఆధారంగా హైకోర్టు ఈ కేసు విచారణని స్వయంగా ఆమోదించడం విశేషం. ఈనెల 18వ తేదీన ఆయన రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఈ లేఖ రాశారు. సరీ్వసులో ఉన్న మేజర్, అతని స్నేహితురాలిపై ఈనెల 15వ తేదీ రాత్రి భరత్‌పూర్ ఠాణాలో జరిగిన అమానుష చర్యపై ఉన్నత న్యాయస్థానం స్వయంగా చొరవ కల్పించుకోవాలని అభ్యర్థించారు. దీనిపై కేసు విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఠాణాలో ఏమి జరిగేందనే అంశం మిస్టరీగా గోచరిస్తోందన్నారు. ఈ పరిస్థితిపై సమగ్రంగా దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు. ఫిర్యాదు చేసేందుకు పోలీసుస్టేషన్‌కు వెళ్లిన సదరు వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారనే ఆరోపణతో ఫిర్యాదు నమోదైన పరిణామాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయన్నారు. ఇదే వాస్తవం అయితే హత్య చేసేందుకు పోలీసు ఠాణాకు ఎవరైనా వెళ్తారా అని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థపై ప్రజల విశ్వాసం, నమ్మకం పునరుద్ధరణకు అభయం ఇవ్వాలని విచారణలో పాలు పంచుకున్న ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ పీతాంబర ఆచార్యకు ధర్మాసనం సూచించింది.

హైకోర్టు పర్యవేక్షించాల్సిందేమీ లేదు

ఈ సంఘటనపై విచారణ జరిపేందుకు పోలీసులకు రాజ్యాంగబద్ధమైన అధికారాలు ఉన్నాయని ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు. దర్యాప్తును హైకోర్టు పర్యవేక్షించాల్సిందేమీ లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసు ఠాణాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై ధర్మాసనానికి వివరణ ఇవ్వాలని అదనపు డైరెక్టర్ జనరల్ (ఆధునికీకరణ) దయాల్ గంగ్వార్‌కు ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ వాయిదా వేసినట్లు ప్రకటించింది. విచారణ పురస్కరించుకుని ధర్మాసనం వ్యక్తం చేసిన అభిప్రాయాలు కేసు వాస్తవ విచారణను ఏమాత్రం ప్రభావితం చేయరాదని స్పష్టం చేయడం గమనార్హం. అలాగే ఈ సంఘటనలో వార్తా ప్రసారాలు పురస్కరించుకుని బాధిత వ్యక్తుల పేర్లు ప్రచురితం కాకుండా జాగ్రత్త వహించాలని ధర్మాసనం మీడియా వర్గానికి సూచించింది. సంఘటనకు సంబంధించిన వివరాలపై వార్తాంశాలు ప్రసారం చేసేందుకు ఎటువంటి ఆంక్షలు లేనట్లు స్పష్టం చేయడం గమనార్హం.



ఒడిశా హైకోర్టు

చీఫ్ సెక్రటరీ సమీక్ష

ఈ సంఘటనపై క్రైం శాఖ విచారణ తాజా స్థితిగతులను రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా సోమవారం ఆయన కార్యాలయంలో సమీక్షించారు. ఈ సమావేశానికి రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా, దర్యాప్తు బృందం అధికారి, క్రైం శాఖ ఏడీజీ అరుణ్ బోత్రా హాజరయ్యారు.

భరత్‌పూర్ ఘటనపై విచారణకు కమిషన్



భువనేశ్వర్: స్థానిక భరత్‌పూర్ పోలీసుస్టేషన్‌లో ఆర్మీ మేజర్, అతని స్నేహితురాలిపై ఠాణా అధికారి, సిబ్బంది అమానుష చర్యల సంఘటన రాష్ట్రాన్ని కుదిపేస్తోంది. అటు సామాన్య పౌరుని నుంచి ఇటు ప్రభుత్వ పాలన, రాజకీయ వర్గాలను సైతం కదిలిస్తోంది. దీంతో ఈ ఆందోళనకర పరిస్థితిపై విచారణకు న్యాయ కమిషన్‌ను నియమించినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సోమవారం ప్రకటించారు. కమిషన్‌కు అధ్యక్షుడిగా రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చిత్త రంజన దాస్‌ని నియమించారు. 60 రోజుల్లో ఈ కమిషన్ విచారణ ముగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. భువనేశ్వర్ ప్రధాన కార్యాలయంగా న్యాయ విచారణ కమిషన్ పని చేస్తుంది. భరత్‌పూర్ ఠాణా మరియు చందకా పోలీసు ఠాణాలు నమోదు చేసిన కేసుల ఆధారంగా కమిషన్ విచారణ కొనసాగిస్తుంది. బాధిత, పోలీసు వర్గాల మధ్య తలెత్తిన అవమాన, అభ్యంతరకర పరిస్థితుల క్రమాన్ని పరిగణనలోకి తీసుకుని విచారణ చేపట్టేందుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ విచారకర సంఘటనలో వ్యక్తులు, వర్గాలు, అధికారుల పాత్ర, పూచీదారితనాన్ని న్యాయ కమిషన్ పరిశీలిస్తుంది. ఈ సంఘటనకు అనుసంధాన, ఆధారిత ఇతర పరిస్థితులను న్యాయ కమిషను విచారణకు పరిగణించేందుకు ఉత్తర్వులు అవకాశం కల్పించాయి. భవిష్యతులో ఇటువంటి పరిస్థితులు మహిళలపై పునరావృతం కాకుండా చేసేందుకు న్యాయ కమిషన్ మార్గదర్శకాలను జారీ చేస్తుంది. మహిళకు సురక్షిత భద్రత కల్పించే దిశలో ఈ మార్గదర్శకాల రూపకల్పన ఆశిస్తున్నారు.

బాధ్యతల స్వీకరణ

సంచలనాత్మకంగా మారిన భరత్‌పూర్ ఠాణా కొత్త ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జిగా దీపక్ ఖొండాయత్ రాయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఠాణాలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. కాగా ఠాణా ప్రాంగణంలో సీసీటీవీ కెమెరా సరంజామా చిందర వందరగా పడి ఉంది. అయితే ఈనెల 15వ తేదీన ఈ ఠాణాలో జరిగిన ఘటనలో భాగంగా అక్కడ సీసీ కెమెరా వ్యవస్థ లేకపోవడంపై బరాబటి కటక్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. కానీ అకస్మాతుగా ఈ ప్రాంగణంలో సీసీటీవీ కెమెరా సరంజామా దర్శనమివ్వడం చర్చనీయాంశమైంది. ఠాణాలో అమర్చేందుకు వీటిని రప్పించినట్లు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఠాణా అధికారి తెలిపారు. పాత భవనంలోని సీసీ కెమెరాలను ఇక్కడ అమర్చనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైతే మరిన్ని కెమెరాలను రప్పించడం జరుగుతుందన్నారు. సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతీ ఠాణాలో సీసీ కెమెరా వ్యవస్థ అనివార్యం. ఈ ఏడాది మార్చి 11వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ భరత్‌పూర్ ఠాణా కొత్త భవనం ప్రారంభించారు. ఈ లెక్కన సుమారు 6 నెలలు గడిచినా ఠాణా కొత్త భవనంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయని పరిస్థితులకు అవకాశం లేదు. తాజా ఘటన నేపథ్యంలో హుటాహుటిన వీటిని తొలగించారేమోనన్న అనుమానం బలం పుంజుకుంటోంది.



ఠాణాలో పూజలు నిర్వహిస్తున్న కొత్త ఇన్‌స్పెక్టర్ దీపక్



ఠాణా ప్రాంగణంలో పడివున్న సీసీ కెమెరాల సరంజామా

సీఎంను కలిసిన బాధిత వర్గం



ముఖ్యమంత్రితో బాధిత వర్గం

భరత్‌పూర్ పోలీసు ఠాణాలో చిత్ర హింసలకు గురైన బాధిత వర్గం సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝిని కలిసింది. బాధితురాలు తన తండ్రి, మాజీ సైనిక అధికారులతో కలిసి ముఖ్యమంత్రితో ఆయన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్, న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, రెవెన్యూ – విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి హాజరయ్యారు. ఈ ఘటనపై ప్రభుత్వం న్యాయ విచారణ కమిషన్ ఏర్పాటు చేయడంపై బాధిత వర్గం హర్షం వ్యక్తం చేసింది.

నేటి భువనేశ్వర్ బంద్ నిలిపివేత



మాట్లాడుతున్న దేవీ ప్రసాద్ మిశ్రా

భువనేశ్వర్: రాష్ట్రంలో విపక్ష బిజూ జనతా దళ్ పిలుపునిచ్చిన బంద్‌ని నిలిపివేసింది. ఈ విషయం బీజేడీ ఉపాధ్యక్షుడు డాక్టర్ దేవీ ప్రసాద్ మిశ్రా విలేకరులకు సోమవారం తెలిపారు. ఈ పిలుపు మేరకు మంగళవారం ఉదయం 6 గంటల నుంచి నిరవధికంగా 6 గంటలపాటు బంద్ నిర్వహించనున్నట్లు తొలుత ప్రకటించారు. అయితే తమ డిమాండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఈ ఆందోళనని నిలిపి వేయనున్నట్లు తెలియజేశారు. స్థానిక భరత్‌పూర్ ఠాణాలో సైనిక అధికారి, అతని స్నేహితురాలిపై జరిగిన అమానుష చర్య వాస్తవాలను తుంగలో తొక్కే ప్రయత్నం జరుగుతుందనే ఆరోపణతో ఆందోళన చేసేందుకు సిద్ధమైంది. ఈ సంఘటనపై న్యాయ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో భువనేశ్వర్ బంద్ ఆందోళన నిలిపివేశారు.

రూ.2.34 లక్షలకు లడ్డూ వేలంపాట

జయపురం: స్థానిక మహాత్మాగాంధీ రోడ్డులో శ్రీబాల గణపతి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన లడ్డూ వేలంపాటలో రూ.2.34 లక్షలకు పట్టణానికి చెందిన గెంబలి శ్రీకాంత్ దక్కించుకున్నారు. ఇప్పటివరకు ఇక్కడ నిర్వహించిన వేలంపాటల్లో ఇదే అత్యధికం కావడం విశేషం. ప్రతీ ఏడాది 21 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి పాత చిమ్టాపల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి చెందిన బసంతి మడ్కమి (25) పురుగుల మందు తాగి ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఈ కేసు విచారణ పురస్కరించుకొని ఆమె భర్త రాజు మడ్కమిని బలిమెల పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రాజు మడ్కమితో కోరుకొండ సమితి బండిగూడ గ్రామానికి చెందిన కళా సోడి కుమార్తె బసంతి సోడికి 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొంతకాలం వారి దాంపత్య జీవితం సజావుగా సాగింది. ఇదిలా ఉండగా రాజు ఆంధ్రాలో రోజుకూలీగా పనిచేస్తూ నెలకొకసారి ఇంటికి వస్తుండేవాడు. అయితే ఈసారి సుమారు రెండు నెలల పాటు ఇంటికి రాకపోవడంతో భార్య బసంతి ఫోన్‌చేస్తే, ఈనెల 17వ తేదీన ఇంటికి వచ్చి 18వ తేదీన భార్యతో గొడవ పెట్టుకున్నాడు. దీంతో ఈ విషయాన్ని బసంతి తన తండ్రికి చెప్పడంతో ఆయన వచ్చి ఇద్దరికీ సర్దిచెప్పి వెళ్లాడు. అనంతరం అదేరోజు రాత్రి తండ్రికి చెప్పిందనే కోపంతో బసంతిని రాజు మరలా కొట్టాడు. దీంతో మనస్తాపానికి గురైన బసంతి పొలంలో వేసేందుకు తీసుకొచ్చిన పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. 19వ తేదీ ఉదయం రాజు తమ్ముడు ఇంట్లోకి వచ్చి చూస్తే ఆమె వాంతులు చేసుకొని స్పృహలో లేదు. దీంతో స్థానికులను పిలిచి మొదట బలిమెళ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బసంతి ఆదివారం ఉదయం 5 గంటలు సమయంలో మృతి చెందింది. దీంతో అల్లుడి వేధింపుల వలనే చనిపోయిందని ఆమె తండ్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు రాజుని అరెస్టు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం అప్పగించారు.

'పార్టీని బలోపేతం చేయాలి'



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపభొత్ర

జయపురం: రాష్ట్రంలో మొదటిసారి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని, ఇకపై పార్టీ బలోపేతానికి మరింతగా కార్యకర్తలు ఉద్యమించాలని కోట్‌పాడ్ ఎమ్మెల్యే రూప భొత్ర పిలుపునిచ్చారు. కుంద్రలోని కల్యాణ మండపంలో పార్టీ కార్యకర్తలతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలు గ్రామాల్లో ప్రతి ఒక్కరినీ కలిసి సభ్యులుగా చేర్చాలని సూచించారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలను మమేకం చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం మొదలగు మౌలిక సౌకర్యాలు ప్రజలకు సమకూరేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నేతలు చంద్రనారాయణ ఆచార్య, తుషార్ భట్, అశ్వినీ చౌదరి, శంకర మహంతి, ప్రభాకర మిశ్ర, సుభాష్ మరిఝ పాల్గొన్నారు.

తెంతులకుంటి బంద్ ప్రశాంతం



ఆందోళన చేస్తున్న ప్రజలు



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీజేడీ నాయకులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి సమితి బంద్ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ఈ సమితిలోని కొంటాగాంలో వారం రోజుల క్రితం ఒక మైనర్ బాలిక (10)పై గుర్తు తెలియని వ్యక్తులు అత్యాచారం చేసి హత్య చేశారు. దీంతో ఈ ఘటనకి కారణమైనవారిని అరెస్ట్ చేయాలని, బాధిత కుటుంబానికి రూ.20 లక్షలు పరిహారం ఇవ్వాలని, పోస్టుమార్టం రిపోర్టు బహిర్గతం చేయాలని కోరుతూ జై తెంతులకుంటి సమాజ్ ఆధ్వర్యంలో బంద్ చేపట్టారు. మరోవైపు ఈ ఘటనకి పాల్పడినట్లు అనుమానంతో 12 మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రతిపక్ష బీజేడీ పార్టీ ప్రతినిధుల బృందం ఆదివారం పరామర్శించింది. పరామర్శించినవారిలో మాజీ ఎంపీ, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమేష్ మజ్జి తదితరులు ఉన్నారు. అలాగే సునాబెడా రేంజ్ డీఐజీ చరణ్ సింగ్ మీనా బాధిత గ్రామాన్ని సందర్శించారు. మూడు పోలీసు బృందాలను ఏర్పాటు చేసి విచారణ ముమ్మురం చేశారు.

క్లుప్తంగా

ఫిర్యాదుల విచారణ



ప్రజా ఫిర్యాదుల విచారణలో సీఎం మోహన్

భువనేశ్వర్: పలు వర్గాల ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సీఎం మోహన్ చరణ్ మాఝి విచారించారు. ఆయనతో పలువురు మంత్రులు ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారు. ఈ విడత విచారణ కోసం ఆన్‌లైన్‌లో 1,000 ఫిర్యాదులను మాత్రమే స్వీకరించారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వీటన్నింటినీ విచారించి సత్వర చర్యల కోసం అనుబంధ శాఖలు, విభాగాల అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. సుమారు 6 వారాల విరామం తర్వాత ముఖ్యమంత్రి ప్రజాభియోగ శిబిరం నిర్వహించారు.

వినతుల స్వీకరణకు స్పందన



మహిళలకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ పట్వారీ

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సమావేశ మందిరంలో కలెక్టర్ ఫరూల్ పట్వారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వినతుల స్వీకరణకు అనూహ్య స్పందన లభించింది. సమితి పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. వీరి నుంచి 318 సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను స్వీకరించిన కలెక్టర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా కార్యక్రమంలో భాగంగా ఇద్దరు నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహకారాన్ని అందించారు. అదేవిధంగా ఒడిశా జీవికా మిషన్‌కు చెందిన స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళల ఆర్థికాభివృద్ధికి సహకారాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరొ, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్, ఎస్పీ హరీష్ బిసి, సమితి బీడీవో మీనాక్షి దాస్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణే ప్రభుత్వాల లక్ష్యం



టీకా వేసుకుంటున్న వృద్ధులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో 2025 నాటికి క్షయ నివారణే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. స్థానిక జిల్లాకేంద్ర ఆస్పత్రిలో బీసీజీ టీకా ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రారంభించారు. 60 ఏళ్లు నిండిన వయో వృద్ధులు టీకాలు ఉచితంగా ఎంసీజీ ఆస్పత్రిలో వేయించుకోవచ్చని సూచించారు. జిల్లాలో 70,791 మంది వయో వృద్ధులకు టీకాలు వేయడానికి లక్ష్యం పెట్టుకున్నట్టు డీఎం డాక్టర్ ప్రమోద్ కుమార్ పండా అన్నారు. కార్యక్రమంలో జిల్లా స్వాస్థ్య సమితి డీపీఎం సౌమ్యరాణి గౌడో తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

జయపురం: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పలువురు పేర్కొన్నారు. స్థానిక విక్రమదేవ్ విశ్వ విద్యాలయంలో ఎన్‌సీసీ క్యాడెట్లు 'ఒక మొక్కకు నా పేరు'తో మొక్కలు నాటారు. ఎన్‌సీసీ క్యాడెట్లు అందరూ ఒక్కొక్క మొక్క నాటారు. కార్యక్రమంలో ఏఎన్‌వో కెప్టెన్ లక్ష్మణ పాత్రో, సంతోష్ కర్కర, శంకర బాగ్, కిశోర్ ఖొర, జె.జగన్నాథ్, యువరాజ్ సింగ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి బొలేరో బోల్తా



బోల్తాపడిన బొలేరో

రాయగడ: కెరడా నుంచి రాయగడ వైపు వస్తున్న ఒక బొలేరో అదుపుతప్పి ఆదివారం సాయంత్రం బోల్తాపడింది. దీంతో వాహన చోదకుడు స్వల్ప గాయాలకు గురవ్వడంతో, జిమిడిపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. కెరడ–జిమిడిపేటకు రహదారి మధ్యలో చోటుచేసుకున్న ఈ ఘటనలో బొలేరో అతివేగంగా రావడంతో అదుపు తప్పినట్లు శశిఖాల్ పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెదజల్లుతున్న దుర్గంధం

పర్లాకిమిడి పురపాలక సంఘం పరిధిలో పలుచోట్ల దుర్గంధం వెదజల్లుతోంది. కొత్త బస్టాండ్ దారిలో కంద్ర వీధి పెట్రోలు బంకు వద్ద మురికి కాలువ నిండిపోవడంతో రోడ్డుపైకి పారుతోంది. అదేవిధంగా పెద్ద బ్రాహ్మణ వీధికి చెందిన వార్డు ప్రజలు మురికి నీరు రోడ్డుపై పారుతుండడంతో ముక్కు మూసుకుంటున్నారు. మరోవైపు మహారాజా కృష్ణ చంద్ర గజపతి పార్క్, న్యూ మార్కెట్ వద్ద తాగునీరు లీకవుతుండడంతో నీరు ఉవ్వెత్తున బయటకి వచ్చి వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అందువలన ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా అధ్యక్షుడు పైల మురళీకృష్ణ కోరారు.

– పర్లాకిమిడి



శ్రీకృష్ణచంద్ర గజపతి పార్క్ వద్ద లీకవుతున్న తాగునీటి పైపు



మెయిన్ రోడ్డుపై పారుతున్న మురుగు నీరు



కంద్రవీధి నుంచి వడ్డీవీధి వరకు పారుతున్న మురుగు నీరు

నవరంగపూర్ బంద్‌కు బీజేడీ పిలుపు



నవరంగపూర్, కలహండి జిల్లా నాయకులతో మాజీ సీఎం నవీన్

భువనేశ్వర్: ఈనెల 26న నవరంగపూర్ జిల్లా బంద్‌కు విపక్ష బిజూ జనతా దళ్ పిలుపునిచ్చింది. జిల్లాలో లోపించిన శాంతిభద్రతల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. స్థానిక శంఖ భవన్‌లో బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ఉభయ నవరంగపూర్, కలహండి జిల్లా శాఖల ప్రముఖులతో సమావేశం అయ్యారు. సాధారణ ప్రజల ప్రయోజనాల పరిరక్షణ, మహిళల సాధికారతకు బీజేడీ సదా కట్టుబడి ఉందని ప్రకటించారు. నవరంగపూర్, కలహండి జిల్లాల నుంచి ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఇతర ప్రముఖులతో నవీన్ పట్నాయక్ సంస్థాగత కార్యకలాపాల్ని చర్చించారు. పార్టీని అట్టడుగు స్థాయి నుంచి బలోపేతం చేయాలని ప్రబోధించారు. బీజేపీ సర్కారు పాలనలో నిత్యావసర సామగ్రి ధరలు రెక్కలు తొడుగుకుంటున్నాయి. ఈ పరిస్థితిని వ్యతిరేకించాలి. నవరంగపూర్ జిల్లా తెంతులిఖుంటి మండలం కొటగాంవ్ గ్రామంలో గిరిజన మైనరు బాలికపై అత్యాచారం, హత్య సంఘటనకు నిరసనగా నవరంగపూర్ జిల్లా బంద్ నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ నిర్ణయం మేరకు ఈనెల 26వ తేదీన 12 గంటల పాటు జిల్లా వ్యాప్తంగా బంద్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. బాలికపై జరిగిన అన్యాయంపై బాధిత తల్లిదండ్రులు ఠాణాలో ఫిర్యాదు చేసినా, పోలీసులు చర్యలు చేపట్టడం లేదని జిల్లా బీజేడీ ప్రముఖులు అధిష్టానం దృష్టికి తీసుకొచ్చారు.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు



రాజేంద్ర సాహుని సన్మానిస్తున్న దృశ్యం

జయపురం: సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని పలువురు పేర్కొన్నారు. అఖిల భారత గ్రామీణ డాక్ సేవక సంఘ కార్యవర్గ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ సాహు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. దీనిలో భాగంగా ఆయనను స్థానిక సంధ్య హోటల్‌లో రాష్ట్ర సంఘ నేతలు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. రాజేంద్ర సాహు కొరాపుట్ జిల్లా డాక్ సేవక సంఘ అధ్యక్షుడిగా అనేక సేవలు అందించి, అఖిల భారత గ్రామీణ డాక్ సేవక సంఘ కార్య నిర్వాహక అధ్యక్షుడిగా ఎదిగి సేవక సంఘ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘ అధ్యక్షుడు కృష్ణచంద్ర ప్రధాన్, కార్యదర్శి సత్యబ్రత మానసింహ, గంజాం జిల్లా ప్రతినిధి రవీంద్ర పండ, పుల్బాణి జిల్లా ప్రతినిధి మానస రంజన్ పాత్రో, కలహండి జిల్లా ప్రతినిధులు పవిత్ర ప్రధాన్, దేవేంద్ర ఠాకూర్, బలంగీర్ జిల్లా ప్రతినిధి జయరథ్ దాస్, కేంద్రపడ జిల్లా ప్రతినిధి బిజయ దాస్, ఒడిశా సర్కిల్ మాజీ కార్యదర్శి పరశురాం దాస్, కైలాశ పట్నాయిక్, జయపురం సిటీ కో–ఆర్డినేషన్ కమిటీ సాధారణ కార్యదర్శి ప్రమోద్ కుమార్ మహంతి, ఒడిశా అమలా సంఘ ప్రతినిది శశిభూషణ దాస్, బి.రామగోపాల్ మొదలగు పాల్గొన్నారు.

ముగిసిన బలి జాతర



పూజారి చంద్రశేఖర్ బెరుకొ ప్రత్యేక పూజలు



ముళ్ల కంపలతో రూపొందించిన ఊయల



నిప్పులపై పూజారి నడుస్తున్న దృశ్యం

రాయగడ: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారి మందిరంలో ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభమైన బలి జాతర పూజలు సోమవారంతో ముగిశాయి. అమ్మవారి సన్నిధానం నుంచి అమ్మవారి కత్తిని పూజారి తీసుకొని నిప్పులపై నడవడం, ముళ్ల కంపలతో రూపొందించిన ఊయలలో ఊగడం వంటి ప్రధాన ఘట్టాలు సాంప్రదాయంగా కొనసాగాయి. అంతకుముందు ఆలయ ప్రధాన పూజారి చంద్రశేఖర్ బెరుకొ పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ముగింపు ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ ముగింపు ఉత్సవాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

కడలి కల్లోలం



అక్కుపల్లి శివసాగర్ తీరంలో ఎగసిపడుతున్న కెరటాలు

వజ్రపుకొత్తూరు రూరల్: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కడలి కల్లోలంగా మారింది. అక్కుపల్లి శివసాగర్, గుణుపల్లి, మోట్టూరు, నువ్వలరేవు తీరాల్లో సోమవారం సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ తీరం వైపు దూసుకువచ్చాయి. దీంతో మత్స్యకారులు ఆందోళన చెందారు. కాగా సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో పెను మార్పులు సంభవించాయి. దీంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వర్షపు నీరు రోడ్లపైకి చేరడంతో రోడ్లు జలమయం అయ్యాయి.

మారేడుమిల్లి ఘటనలో టెక్కలి విద్యార్థికి తీవ్ర గాయాలు

టెక్కలి: మారేడుమిల్లిలో విహారయాత్రకు వెళ్లి జల తరంగిణి జలపాతంలో గల్లంతైన మెడికల్ విద్యార్థుల్లో టెక్కలికి చెందిన విద్యార్థి సీహెచ్ హరిణిప్రియ తీవ్రంగా గాయపడింది. విద్యార్థిని ప్రస్తు తం రాజమండ్రిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన రాజమండ్రి బయల్దేరారు. ప్రస్తుతానికి విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.

యోగి లక్ష్మి నేత్రాలు సజీవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని హడ్కోకాలనీలో నివాసం ఉంటున్న కొల్లూరు యోగిలక్ష్మి అనారోగ్య కారణంగా ఆదివారం మృతి చెందారు. మరణానంతరం ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసేందుకు ముందుకువచ్చారు. రెడ్‌క్రాస్‌ను సంప్రదించగా సంబంధిత సిబ్బంది వచ్చి కార్నియాలను సేకరించారు. వీటిని విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందచేశారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842699321 నంబరుకు కాల్‌చేయాలని రెడ్‌క్రాస్ సిబ్బంది కోరారు.

కోణార్కు మందిరం లేజర్ స్కానింగ్



కోణార్క్ సూర్య దేవాలయం

భువనేశ్వర్: ప్రపంచ ప్రఖ్యాత్య కోణార్కు సూర్య దేవాలయం, పరిసరాల భూగర్భంలో ప్రాచీన, పౌరాణిక, చారిత్రాత్మక దాఖలాలు వగైరా సమాచారం కోసం సన్నాహాలు ప్రారంభించారు. ఈ మందిర సముదాయం పరిసరాల భూగర్భంలో లెక్కకు మిక్కిలిగా పలు ఆలయాలు ఇతరేతర కట్టడాలు ఉన్నట్లు కథనాలు ప్రసారంలో ఉన్నాయి. ఈ విషయమై అధునాతన రీతిలో జీపీఆర్‌ఎస్ లేజర్ స్కానింగ్ ప్రక్రియ ప్రారంభించారు. భారత పురావస్తు శాఖ పూరీ సర్కిల్ సూపరింటెండెంట్ డి.బి.గొడొనాయక్, డిప్యూటీ ఇంజినీరు చిత్తరంజన దాస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నేషనల్ జియెగ్రాఫికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్‌ఐ) త్రిసభ్య వైజ్ఞానిక నిపుణుల బృందం జీపీఆర్‌ఎస్ లేజర్ స్కానింగ్ చేపడుతోంది. వీరిలో సీనియర్ వైజ్ఞానికుడు డాక్టర్ ఎ.కె.పాండే, నీలేష్ కుమార్ జయస్వార్, సతీష్ చంద్ర వర్మ సభ్యులుగా ఉన్నారు. కోణార్క్ సూర్య దేవాలయం నలువైపులా 10 మీటర్ల లోతున భూగర్భంలో నిక్షిప్తమై ఉన్న భగ్న అంశాలు, నిర్మాణాలు, కట్టడాలు వగైరా సమాచారం కోసం యాంత్రిక పరికరాలతో సర్వే నిర్వహిస్తున్నారు. జీపీఆర్‌ఎస్ లేజర్ స్కానింగ్ నివేదిక ఆధారంగా సూర్య మందిరం నలు వైపుల సౌందర్యీకరణ పనులు చేపట్టనున్నట్లు భారత పురావస్తు శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

29న జిల్లా యోగాసన పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన నిర్వహిస్తున్న జిల్లాస్థాయి యోగాసన పోటీలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ ప్రతినిధులతో కలిసి సమావేశమయ్యారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో జరగను న్న ఈ ఈ యోగాసనాల ప్రక్రియ ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి మొదలవుతుందన్నారు. 10 నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన వారిని అక్టోబర్ 5, 6 తేదీల్లో కర్నూలు జిల్లా వేదికగా జరిగే రాష్ట్రపోటీలకు పంపిస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగినవారు 96764 72733, 94922 66889, 94911 54156 నంబర్లనుసంప్రదించాలని జిల్లా యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కేదార్‌నాథ్ పేర్కొన్నారు.

ఉత్సాహంగా స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు



తైక్వాండో ఎంపికల్లో క్రీడాకారుల విన్యాసం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపికలు ఆద్యంతం ఉత్సాహంగా సాగుతున్నాయి. మలివిడత షెడ్యూల్‌లో భాగంగా తొలిరోజు ఆదివారం బాక్సింగ్ ఎంపికలు పూర్తికాగా.. రెండోరోజు సోమవారం స్విమ్మింగ్, తైక్వాండో, ఫెన్సింగ్, టెన్నీకాయిట్ క్రీడాంశాల్లో సాగాయి. ఇందులో స్విమ్మింగ్ ఎంపికలు శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్ వేదికగా జరిగాయి. ఫెన్సింగ్, తైక్వాండో ఎంపికలు శ్రీకాకుళం నగరంలోని టౌన్‌హాల్ వేదికగా సాగాయి. అలాగే టెన్నీకాయిట్ ఎంపికలు పలాసలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానం వేదికగా జరిగాయి. ఎంపికైన క్రీడాకారుల జాబితాలను త్వరలో వెల్లడించనున్నట్టు ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు పేర్కొన్నారు. అయితే పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు భోజనాలు లేకుండా ఆకలితో అలమటిస్తుండటంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి'



జయపురం: ఆందోళన చేపడుతున్న కార్మికులు



రాయగడ: ప్రధాని దిష్టిబొమ్మను తగలబెడుతున్న ట్రేడ్ యూనియన్ నాయకులు

రాయగడ: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని ట్రేడ్ యూనియన్ల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. దీనిలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను పెట్రోల్ పోసి తగలబెట్టారు. దేశంలో కార్పొరేట్ల పెత్తనం కొనసాగుతోందని, దేశ సంపద ప్రైవేటు వ్యక్తుల గుప్పెట్లోకి వెళ్లిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాన్ని విరమించకపోతే ట్రేడ్ యూనియన్లు భవిష్యత్‌లో చేపట్టనున్న ఆందోళనలు మరింత తీవ్రతరమవుతాయని హెచ్చరించారు. ఇదిలాఉండగా కార్మికులను చిన్న చూపు చూస్తున్న కేంద్ర ప్రభుత్వం శ్రమ కార్డులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రతీ కార్మికుడికి అత్యల్పంగా నెలసరి మజూరి రూ.34 వేలు మంజూరు చేయాలన్నారు. అనంతరం జిల్లా అదనపు కలక్టర్ భాస్కర్ రైతాకు ఒక వినతిపత్రంను అందించారు. కార్మిక నాయకుడు తిరుపతి గొమాంగో ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో ఐఎన్‌టీయూసీ నాయకులు భవానీ శంకర్ జెన్న, గుణ నాయక్, మూర్తి మినియాక, బలరాం కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

జయపురం: అఖిల భారత కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం జయపురంలో వివిధ కార్మిక సంఘాల నేతలు, కార్యకర్తలు బ్లాక్ డేను నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక కార్మిక భవనం నుంచి బస్టాండ్ ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అచ్చట నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వెళ్లి కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ ఎ.శౌర్య రెడ్డికి ప్రధానమంత్రిని ఉద్దేశించిన మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో కార్మిక నేత ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జుడిష్టర్ రౌళో, ఆందోళన పత్రికా సంపాదకుడు, కార్మిక నేత సత్యబ్రత నంద, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణ దాస్, ఉత్తమ మల్లిక్, త్రిపతి మఝి, తరిణి చంద్రమాలి, సుధాంశు శేఖర నాగ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల శిక్ష

విజయనగరం క్రైమ్: జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్‌లో 2023లో నమోదైన పోక్సో కేసుకు సంబంధించి ముద్దాయికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.7వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. పూసపాటిరేగ మండలం పెదతాడివాడ గ్రామానికి చెందిన కలిశెట్టి ఉమామహేశ్వరరావు అలియాస్ ఉమ అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో వెంటపడి, లైంగికంగా వేధింపులకు గురిచేసేవాడు. 2022 నవంబరు 23న బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో విజయనగరం మహిళా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా, అప్పటి డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ పూర్తయ్యే విధంగా మహిళా పీఎస్ సీఐ ఈ.నరసింహమూర్తి చర్యలు చేపట్టారు. పోలీసుల తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు ఈ కేసులో వాదనలు వినిపించారు.

దాడిలో గాయపడిన యువకుడి మృతి


శ్రీధర్ మృతదేహం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని గౌడు వీధికి చెందిన గౌడు శ్రీధర్ (24) తనపై జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడడంతో విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గౌడు శ్రీధర్‌కు అదే కాలనీలో ఉన్న గౌడు లల్లు (రవి) అనే మరో యువకుడితో పాత తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 13వ తేదీన తెల్లవారు జామున ఇంట్లో నిద్రిస్తున్న శ్రీధర్‌పై లల్లు దాడికి పాల్పడ్డాడు. ఆ దాడిలో తీవ్రంగా గాయపడిన శ్రీధర్‌ను కుటుంబసభ్యులు కురుపాం ఆస్పత్రికి తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడని, ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడు శ్రీధర్‌కు తల్లిదండ్రులతో పాటు భార్య, కుమార్తె ఉన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

రామభద్రపురం: మండలం పరిధిలోని ముచ్చర్లవలస గ్రామానికి చెందిన వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన టొంపలి సూర్యనారాయణ(50) మద్యానికి బానిస కావడంతో కుటుంబాల తగాదాల నేపథ్యంలో మనస్తాపం చెంది ఆదివారం గడ్డి మందు తాగేశాడు. ఈ విషయం గమనించిన కుటుంబ సభ్యులు విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతిచెందాడు, భార్య కళావతి ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఏఎస్సై ఐవీ రమణ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు, మృతుడికి భార్య, సాయిలక్ష్మి, సాయికుమార్ పిల్లలున్నారు.

నదిలో గల్లంతైన రైతు మృతదేహం లభ్యం


రైతు మృతదేహం

జామి: మండల కేంద్రం జామి గోస్తనీ నదిలో ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు గల్లంతైన రైతు కొత్తలి దేముడు (64) మృతదేహం సోమవారం మధ్యాహ్నం బయటపడింది. ఆదివారం రాత్రి నుంచి పోలీసులు, రెవెన్యూ సిబ్బంది మృతదేహంకోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది, తహసీల్దార్ ఐ.కృష్ణలత, ఏఎస్సై రాజనరసింగరావుల సమక్షంలో గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యం కాకపోవడంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని రప్పించేందుకు తహసీల్దార్ ప్రయత్నిస్తున్న సమయంలో నీటిపై రైతు దేముడు మృతదేహం తేలింది. దీంతో స్థానికులు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. అనంతరం శవపంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి భార్య లక్ష్మి ఉంది.

గాయపడిన వ్యక్తి మృతి


సురేష్ (ఫైల్)

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామం వద్ద మూడురోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆదిరెడ్డి సురేష్ విశాఖలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. సురేష్ తన ద్విచక్రవాహనంపై గ్రామం నుంచి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో వాహనం ఢీకొట్టడంతో గాయపడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలీనాలీ చేసుకునే సురేష్ జీవించేవాడని అకస్మాత్తుగా మృత్యువాత పడడంతో కుటుంబం దిక్కులేనిదైందని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- బెంబేలెత్తిస్తున్న నిత్యావసర సరుకులు
- హడలిపోతున్న వినియోగదారులు

వంటింట్లో ధరల మంట


మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కాయగూరలు

కూరగాయలు	ధర (కేజీ రూ.లలో)
వంకాయ	45
బీరకాయ	40
బెండకాయ	40
దొండకాయ	40
పచ్చిమిర్చి	65
క్యారెట్	45
బీట్‌రూట్	55
బంగాళదుంప	40
చిక్కుడు	45
కాలీఫ్లవర్ రకాలు	30 నుంచి 40
ములక్కాడ	50
ఉల్లి	50 నుంచి 60 మధ్య

పాలకొండ రూరల్: మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు మండిపోతున్నాయి. ఇటీవల వచ్చిన వర్షాలు, వరదలతో స్థానికంగా పండే కూరగాయల పంటలు దెబ్బతినడంతో వాటి ధరలకు రెక్కలొచ్చాయి. దిగుమతి సుంకం దెబ్బకు వంట నూనెల ధరలు అమాంతం పెరిగిపోయాయి. డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేక చికెన్, మటన్, చేపలు, రొయ్యల ధర కిలో రూ.250 నుంచి రూ.850, 900కు చేరుకోగా గుడ్లు రూ.7 నుంచి 8 పలుకుతుండడంతో ఏం కొనాలో? ఎలా తినాలో? అర్థం కాక పేద వర్గాల వారు అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని 15 మండలాల్లో అనేక గ్రామాల ప్రజలు కాయగూరల సాగులపై ఆధారపడుతున్నారు. పాలకొండ-వీరఘట్టం రోడ్డు, తుమరాడ, గరుగుబిల్లి, రుద్రిపేట, అన్నవరం, చినమంగళాపురం, వీరఘట్టం, కంబర, దశమంతుపురం, చిదిమి రోడ్డు, పాలమెట్ట, సీతంపేట, భామిని, గుమలక్ష్మీపురం, కొమరాడ, గంగరేగువలస, కుమ్మరిగుంట, దలాయిపేట, కళ్లికోట, దుగ్గి, గుణానుపురం తదితర ప్రాంతాల్లోని వేల ఎకరాల్లో కూరగాయల పంటలు సాగవుతున్నాయి. ముఖ్యంగా బీర, బెండ, దొండ, వంకాయ, కాకర, ఆనప, టమాటో, క్యాబేజీ రకాలు, చిక్కుడు, కంది, ఆగాకరకాయలు తదితర పంటలను సేద్యం చేస్తున్నారు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో అల్పపీడనాలతో వచ్చిన వరుస వర్షాలతో స్థానిక రైతులు నష్టపోయారు. పంట రక్షించుకునే క్రమంలో అధిక మదుపులు పెడుతున్నారు. దీంతో జిల్లాలో కూరగాయల సాగు తగ్గింది. ఇతర జిల్లాల్లోనూ వరదల కారణంగా దిగుబడికి ఆటంకం ఏర్పడి. ఆ ప్రభావం ఈ ప్రాంత వినియోగదారులపై పడుతోంది.

ధరలకు రెక్కలు..

స్థానికంగా సాగవుతున్న పంటలు దెబ్బతినడంతో వాటి దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. మరోపక్క గణేష్ నవరాత్రి వేడుకలు ముగియడంతో జిల్లా వ్యాప్తంగా అన్న సమారాధనలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉత్సవ కమిటీలు భారీ ఎత్తున అన్న సంతర్పణలు నిర్వహిస్తుండడంతో కూరగాయాలకు డిమాండ్ బాగా పెరిగి. గడిచిన వారంలో కేజీపై రూ.8 నుంచి రూ.10 ధర పెరిగినట్లు వినియోగదారులు చెబుతున్నారు. మరోపక్క ఉల్లిపాయల ధర రూ.50 నుంచి రూ.60కు చేరి దిగిరావడం లేదు. బయట మార్కెట్‌లో ధరలు ఇలా ఉంటే తోపుడు బండ్లు, సైకిళ్లపై అమ్మకాలు చేసే వారి ఆగ్గర వద్ద ఈ ధరలు మరో రకంగా ఉంటున్నాయి. ప్రస్తుతం వాతావరణం అనుకూలించి కొత్త పంటలు వేసేందుకు వీలులేని పరిస్థితి. మెట్ట ప్రాంతంలోని కూరగాయల పంటలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేందుకు మరో మూడువారాల పైనే సమయం పడుతుందని వ్యాపారులు అంటున్నారు. వచ్చే నెల మొదటి వారంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు మొదలుకానుండడం, నవంబరులో కార్తీకమాసం ప్రారంభం కానుండడంతో కూరగాయల వినియోగం మరింత పెరగనుంది. దీంతో వాటి ధరలు మరింతగా ఆకాశాన్నంటే పరిస్థితి ఉండనుందని వర్తకులు చెబుతున్నారు.

కాక పుట్టిస్తున్న వంట నూనె

ఈడిబుల్, క్రూడాయిల్ దిగుమతులపై టాక్స్ పెంపుదల ఆయిల్ ధరలపై ప్రభావం చూపింది. రిఫైండ్ ఆయిల్స్‌పై పన్నును 13.75 శాతం నుంచి 35.75 శాతానికి, క్రూడాయిల్‌పై 5.5 శాతంగా ఉన్న కస్టమ్స్ డ్యూటీని 27.50 శాతానికి పెంచడంతో ఒక్కసారిగా ఆయిల్ ధరలు భగ్గుమన్నాయి. 850 గ్రాముల ఆయిల్ ప్యాకెట్స్‌పై రూ.19 నుంచి రూ.25 వరకు పెరగడం పేదవర్గాల వారికి భారంగా మారింది. వినియోగదారుల ఆవసరాలను అసరాగా చేసుకుని కొంతమంది వర్తకులు కృత్రిమ కొరత సృష్టించి కాసులు దండుకుంటున్నారు. ఈ వ్యవహారంపై కొరడా ఝుళిపించాల్సిన అధికారుల జాడ అంతంత మాత్రంగా ఉండడంతో ప్రజలకు ధరల భారం మోయక తప్పడం లేదు.

ధరలు మండిపోతున్నాయి



గడిచిన వారం రోజుల్లో కూరగాయల ధర కేజీపై రూ.10 వరకూ పెరిగింది. నూనెల ధరలు మండిపోతున్నాయి. మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మాలాంటి వారిపై ధరల ప్రభావం అధికంగా ఉంది. ధరల నియంత్రణ చేయకుంటే ఎలా? వ్యాపారులు డిమాండ్‌కు తగ్గట్లు దిగుబడి లేదంటున్నారు. పంటలు పండకపోవడంతో ధర పెరిగిపోతోందని చెబుతున్నారు. వచ్చే నెలల్లో మరింతగా కాయగూరల ధరలు పెరగనున్నట్లు పరిస్థితులు కనిపిస్తున్నాయి. రూ.వందకు రెండు రకాల కూరలు రావడం గగనంగా ఉంది.
– పి.ప్రమీల, పాలకొండ

నష్టపోతున్నాం



వరుస వర్షాలతో కూరగాయల పంటలు నష్టపోయాం. ప్రస్తుత నెలలో భారీ వర్షాలతో తీగజాతి, పందిరి సాగు తీవ్రంగా పాడై దిగుబడి తగ్గింది. నాణ్యతా లోపం పేరిట దళారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వారికి నచ్చిన రేటుకు వినియోగదారులకు అమ్ముతున్నారు. అక్టోబర్‌లో కూడా వర్షాలు తప్పవని చెబుతున్నారు. ఇలా అయితే పంటలు సేద్యం చేయడం కష్టమే.
– నల్లిబాలు, కాయగూరల రైతు, గరుగుబిల్లి, పాలకొండ మండలం

ఆకాశాన్ని తాకుతున్న మాంసాహారం

సీజనల్ వ్యాధుల బెడద, శ్రావణ మాసం ప్రభావంతో గత నెలలో కిలో రూ.150కు పడిపోయిన చికెన్ ధర మెల్లమెల్లగా పెరుగుతోంది. జిల్లాలో ఏడు లక్షల వరకు బ్రాయిలర్ కోళ్ల పెంపకం జరుగుతోంది. వినాయకచవితి ఉత్సవాల నేపథ్యంలో అమ్మకాలు పెద్దగా ఉండవని పూర్తిస్థాయిలో కొత్త బ్యాచ్‌లు వేయకపోవడంతో డిమాండ్‌కు తగిన స్థాయిలో కోళ్లు లేక వాటి ధర పెరుగుతోంది. ప్రస్తుతం కిలో రూ.230 నుంచి రూ.250కు చేరింది. మటన్ రూ.850 నుంచి రూ.900లకు చేరింది. మేలు రకం చేపలు కేజీ రూ.150నుంచి రూ.180కి చేరగా కొరమేను రూ.400, రొయ్యలు రూ.450 ధర పలుకుతున్నాయి. గుడ్డు రూ.7 నుంచి రూ.8కి చేరింది.

మాజీ మంత్రి పడాల అరుణ ఇంట విషాదం

- పరామర్శించిన శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స తదితరులు


మాజీ మంత్రి పడాల అరుణను ఓదార్చుతున్న శాసన మండలి ప్రతి పక్షనేత బొత్స సత్యనారాయణ, పక్కన ఆయన సోదరుడు మాజీ ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

దత్తిరాజేరు: గజపతినగరం నియోజకవర్గం జనసేన నాయకురాలు మాజీ మంత్రి పడాల అరుణ కుమారుడు శరత్ అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న శాసనమండలిలో ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు బొత్స సత్యనారాయణ, ఆయన సోదరుడు గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్యతో కలిసి సోమవారం ఆమె ఇంటికి వెళ్లి మృతదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను మాజీ మంత్రిని అడిగి తెలుసుకుంటున్న సమయంలో ఆమె భోరున విలపించడంతో బొత్స సోదరులు ఆమెను ఓదార్చారు. ఒకగానొక్క కొడుకు మృతి చెందాడంటూ కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమై రోదిస్తుంటే అక్కడికి వచ్చిన వేలాది మంది కళ్లు చెమ్మగిల్లాయి. వైఎస్సార్‌సీపీ నాయకురాలు, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, మంత్రి గుమ్మడి సంధ్యారాణి నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తండ్రి కొండలరావు, మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు, పలు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు మాజీ మంత్రి పడాల అరుణను పరామర్శించిన వారిలో ఉన్నారు.

న్యాయమూర్తి మానవేంద్రనాథ్ రాయ్‌కు మాతృవియోగం


విజయలక్ష్మి(ఫైల్)


విలపిస్తున్న కుటుంబ సభ్యులు

పార్వతీపురం: గుజరాత్ ఉన్నత న్యాయస్థాన న్యాయమూర్తి చీకటి మానవేంద్రనాథ్‌రాయ్‌కు మాతృ వియోగం కలిగింది. తల్లి చీకటి విజయలక్ష్మి(80) అనారోగ్యంతో విశాఖపట్నంలో ఆదివారం మృతిచెందారు. ఈ మేరకు పార్వతీపురంలోని స్వగృహంలో సోమవారం అంత్యక్రియలను నిర్వహించారు. విశాఖపట్నం జిల్లా న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, విజయనగరం జిల్లా న్యాయమూర్తి కళ్యాణ్ చక్రవర్తి, శ్రీకాకుళం జిల్లా న్యాయమూర్తి మౌలానా అహ్మద్, పార్వతీపురం అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదరరావు, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సౌమ్యజాస్పిన్‌లు భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, ఎస్పీ మాధవరెడ్డి, బార్ కౌన్సిల్ అధ్యక్షులు నల్ల శ్రీనివాసరావు, వైద్యులు రామ్మోహనరావు, వై.వివేక్, న్యాయవాదులు టి.జోగారావు, బి. వెంకటనాయుడు, పీవీ కృష్ణారావు, జి.శశిభూషణరావు, డి.మహందాతనాయుడు, జి.వెంకటరావుతో పాటు పలువురు సంతాపాన్ని తెలిపారు. ఆమె ముగ్గురు కుమారుల్లో పెద్దకుమారుడు గుజరాత్ ఉన్నత న్యాయస్థాన న్యాయమూర్తి కాగా, మూడవ కుమారుడు వివేకానంద శ్రీనివాస్ ప్రస్తుతం రాజాం సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్నారు.

ఈ-లాటరీ ద్వారా ఇళ్ల స్థలాల కేటాయింపు


ఇళ్ల స్థలం కేటాయించిన పత్రాన్ని లబ్ధిదారుకు అందజేస్తున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: డెంకాడ మండలంలోని రఘుమండ వద్ద వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన ఎన్‌టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ లే అవుట్‌లో మిగిలిన 44 ఎంఐజీ ఇళ్ల స్థలాల కోసం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఈ-లాటరీ ప్రక్రియ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనితల సమక్షంలో కంప్యూటర్ ద్వారా లాటరీ నిర్వహించి స్థలాలను కేటాయించారు. లాటరీ విజేతలకు ప్లాటు కేటాయింపు పత్రాలను అందజేసి జేసీ వారిని అభినందించారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ అధికారులు శ్రీనివాసమూర్తి, గోపీనాథ్, సహాయ ప్లానింగ్ అధికారులు మౌనిక, నాయుడు, జేపీఓ జానకి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారానికి అర్హుల జాబితా ప్రదర్శించండి

- మరో రెండు వారాలు భారీ వర్షాలు
- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


పొలం పిలుస్తోంది పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు దెబ్బతిని ప్రభుత్వం నుంచి పరిహారం పొందేందుకు అర్హులైన వారి జాబితాలను ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించి దీనిపై ఎవరికైనా అభ్యంతరాలుంటే వాటిని స్వీకరించి నివేదించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తహసీల్దార్‌లను ఆదేశించారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో 66 ఇళ్లు దెబ్బతిన్నాయని వాటికి పరిహారం అందించాలని తహసీల్దార్‌ల నుంచి నివేదికలు అందాయని ఆయా మండలాల్లో ఇళ్ల పరిహారానికి అర్హులైన వారి జాబితాలు ప్రదర్శించాలని కలెక్టర్ చెప్పారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నుంచి తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లు కోల్పోయిన వారి బ్యాంకు ఖాతాల్లో సెప్టెంబర్ 25న పరిహారం జమ చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పంటనష్టం వివరాలకు సంబంధించి కూడా రైతుల నుంచి ఏవైనా అభ్యంతరాలుంటే స్వీకరించాలని సూచించారు. పరిహారం అందించడంలో ఏ ఒక్క రైతునూ విస్మరించారనే మాట రాకూడదని స్పష్టం చేశారు. వచ్చే రెండు వారాలపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్ని మండలాల తహసీల్దార్లు, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరణ


వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పొలం పిలుస్తోంది పోస్టర్లను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీఅనిత, ఉద్యానశాఖ డీడీ జమదగ్ని, ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ, మార్కెటింగ్ ఎ.డి బి.రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.


28న 'మన ఇల్లు మన గౌరవం'


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: మన ఇల్లు మన గౌరవం కార్యక్రమాన్ని ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లా అధికారులు, మండల అధికారులతో ఈ మేరకు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సమీక్షించారు. ఇప్పటికే మంజూరైన ఇళ్లను వచ్చే ఫిబ్రవరి నెలలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలతో పాటు స్వయం సహాయక సభ్యులకు రూ.30వేలు రుణం లభిస్తుందని, మండల ప్రత్యేకాధికారులు మంగళ, బుధవారాల్లో మండలాల్లో పర్యటించి ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. 28న లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించి ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని చెప్పారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి


ధనుంజయరావు(ఫైల్)


చిన్నారులతో తల్లి, భార్య కుటుంబసభ్యులు

జి.సిగడాం: జీవనోపాధి కోసం గుంటూరుకు బయల్దేరిన వ్యక్తి ప్రయాణం మధ్యలోనే ఆగిపోయింది. కుటుంబ పోషణ కోసం వెళ్లిన వ్యక్తి రైలు ప్రమాదంలో చనిపోయారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఆనందపురం గ్రామానికి చెందిన డొప్ప ధనుంజయరావు (26) సోమవారం గుంటూరు వెళ్లడానికి విజయనగరం జిల్లా చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. రైలెక్కిన కాసేపటికే నెల్లిమర్ల చంపావతి వంతెన దగ్గర రైలు నుంచి కాలుజారి పడిపోయి మృతి చెందాడని తోటివలస కూలీలు పోతురాజ నారాయణరావు మృతుడి కుటుంబానికి సమాచారం ఇచ్చారు. దీంతో వారు సంఘటన స్థలానికి వెళ్లారు. మృతుడికి భార్య మంగమ్మ, రెండేళ్ల పాప నిచిత, ఆరునెలల బాబు విరాట్ ఉన్నారు. ధనుంజయరావు మృతి చెందడంతో ఆనందపురం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహానికి శవ పంచనామా నిర్వహించాక గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. వీరిది సామాన్య కుటుంబమని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

గ్రీవెన్స్ సెల్‌కు అధికంగా రెవెన్యూ సమస్యలు

- మొత్తం వినతులు 294


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అర్జీలు కుప్పలు తెప్పలుగా వచ్చాయి. వాటిలో రెవెన్యూ సమస్యలే అత్యధికంగా ఉండడం విశేషం. కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ కలెక్టర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి 294 వినతులు స్వీకరించి వాటి పరిష్కారం కోసం సంబంధిత జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చారు. మండల స్థాయిలో పరిష్కారం కావాల్సిన పలు వినతులపై కలెక్టర్ నేరుగా ఆయా సమస్యలకు చెందిన మండలాల తహసీల్దార్లతో వీడియో కాన్ఫెరెన్స్‌లో మాట్లాడి ఆయా వినతులు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన 294 అర్జీలలో రెవెన్యూ శాఖకు అధికంగా 227, డీఆర్‌డీఏకు 24, పంచాయతీ రాజ్ శాఖకు 10, గృహనిర్మాణ సంస్థకు 9, ఈపీడీసీఎల్, విద్యా శాఖలకు 7 చొప్పున, వైద్యారోగ్యశాఖకు 6, గ్రామ వార్డు సచివాలయాలు, ఆస్పత్రుల సమన్వయాధికారికి రెండు చొప్పున వినతులు వచ్చాయి. వినతుల స్వీకరణ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 81 పిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించి ప్రజల నుంచి 81 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ యానివర్స్, ఎస్పీ సీఐ ఎ.లీలారావు, డీసీఆర్‌బీ ఎస్సై ఆర్.వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల దుర్వినియోగంపై కఠిన చర్యలు

పార్వతీపురం: ప్రజా పెన్షన్లను అనర్హులకు అందజేస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడు ప్రజల నుంచి 200 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీలపై వెంటనే చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా గరుగుబిల్లి మండలం రావుపల్లి గ్రామానికి చెందిన కొర్నాన రమేష్, ఎం.ఘట్టంనాయుడు, బోను ఎరుకునాయుడు, బొంతాడ కృష్ణవేణి, బొంతాడ కుదుములమ్మ, బార్ల పోతయ్యలకు మరణించినప్పటికీ పెన్షన్ల పంపిణీ జరుగుండంపై ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో గ్రామస్తులు ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ సమాధానమిచ్చారు. పెన్షన్ల మంజూరు, పంపిణీలో అవకతవకలకు పాల్పడితే అందుకు బాధ్యులైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట

పార్వతీపురం టౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నట్లు ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి 15 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. అర్జీదారులతో ఈ సందర్భంగా ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రుల వేధింపులు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించు కోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించారు. వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవా లైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీ దారుల వినతులకు సకాలంలో పరిష్కారం

సీతంపేట: అర్జీదారులు పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఇచ్చిన వినతులను సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన 87 వినతులు స్వీకరించారు. వినతుల్లో భాగంగా తాగునీటిసదుపాయం కల్పించాలని వలసగూడకు చెందిన సుబ్బారావు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ మంజూరు చేయాలని ఆంపురానికి చెందిన జగన్నాయకులు వినతిపత్రం అందజేయగా సవర పోలయ్య వ్యవసాయ బోరు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు, మినీగురుకులంలో టీచర్ పోస్టు ఇప్పించాలని పి.నిరోషా, జల్లారకు చెందిన విశ్వనాథం వరదగోడ నిర్మించాలని కోరారు. కారక్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, పీహెచ్‌వో గణేష్, గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి దర్శనం ఉచితం

- తొలేళ్లు, సిరిమానోత్సవం రోజున ప్రత్యేక ఏర్పాట్లు
- పైడితల్లి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి కొండపల్లి



విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారిని తొలేళ్లు, సిరిమానోత్సవం పర్వదినాల్లో భక్తుల కు ఉచిత దర్శనం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపా రు. గతంలో ఆ రెండు ప్రత్యేక దినాల్లో ఉచిత దర్శనంతో పాటు రూ.100, రూ.300 రూ.50 వంతున టికెట్ల అమ్మకం ద్వారా దేవాలయానికి సుమారు రూ.15 లక్షల ఆదాయం వచ్చేదన్నారు. లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత దర్శన సదుపాయం కల్పించిందన్నారు. అక్టోబర్ 15న జరిగే సిరిమానోత్సవం నాడు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను మంత్రి శ్రీనివాస్ సమర్పించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.సత్యనారాయణ సోమవారం జీఓ నంబర్ 656 జారీ చేసినట్టు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు.